క్లుప్తంగా

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ వైఎస్సార్

వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రతిమకు పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న బలసాని

గుంటూరు రూరల్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఏటుకూరులోని నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ 15వ వర్ధంతి నివాళి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రతిమకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకోసం అహర్నిశలు కృషిచేసిన నాయకుడు డాక్టర్ వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఆరోగ్యశ్రీ ద్వారా ఎందరో ప్రజలు తమ ప్రాణాలను కాపాడుకున్నారన్నారు. అనంతనం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పేదల మనిషి డాక్టర్ వైఎస్సార్



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ పద్మావతి తదితరులు

పేదల మనిషి దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ అని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి తెలిపారు. సోమవారం వెంగళాయపాలెం, చల్లావారి పాలెం రెడ్డిగారిబజార్ సమీపంలో ఏర్పాటు చేసిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ 15వ వర్ధంతి సందర్భంగా మహానేత విగ్రహానికి ఎంపీపీ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వైఎస్సార్ సీపీ నేత రవీంద్రనాథ్‌కు ఘన నివాళి



పొన్నూరు: మండలంలోని చింతలపూడి గ్రామ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ప్రముఖ వైద్యులు డాక్టర్ నల్లమోతు రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, డాక్టర్ నల్లమోతు రూత్ రాణితో పాటు పార్టీ నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, అంబటి వెంకటేశ్వరరావు, బోయి నాగరాజు, వడ్రాణం ప్రసాదు, బొనిగల వేణుప్రసాద్, షేక్ నాజర్, యందేటి వెంకట సుబ్బయ్య పాల్గొని రవీంద్రనాథ్ ఠాగూర్ సమాధికి పూల మాలలతో నివాళులర్పించారు.


ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలి



నెహ్రూ నగర్: ప్రజలు ఇస్తున్న అర్జీలను క్షేత్ర స్థాయిలో అధికారులు నేరుగా పరిశీలించి, అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండా, నాణ్యమైన పరిష్కారానికి విభాగాధిపతులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సోమవారం ప్రజల నుంచి 41 ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, వెంకటలక్ష్మి, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ శ్యాం సుందర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

ఇంకా తగ్గని వరద ఉధృతి

- సముద్రాన్ని తలపిస్తున్న పంట పొలాలు
- నీట మునిగిన వేజండ్ల, సుద్దపల్లి, వీరనాయకునిపాలెం, చేబ్రోలులోని పంటపొలాలు
- పొంగిన తుంగభద్ర కాలువ..
- ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికుల ఇబ్బందులు



చేబ్రోలులో సముద్రాన్ని తలపిస్తున్న వరి పొలాలు



చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెం డొంక రోడ్డులో నడుం లోతులో ఉన్న వరదనీరు



డీవీసీ కాలనీలో ఇళ్లలోకి చేరిన నీరు



వైద్యసేవలందిస్తున్న సిబ్బంది..



కాలనీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

చేబ్రోలు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు చేబ్రోలు మండలంలోని పంటపొలాలు నీట మునిగాయి. సోమవారం నాటికి కూడా పొలాలు ముంపు బారి నుంచి బయటపడలేదు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద తాకిడికి పొలాలు సముద్రాన్ని తలపిస్తున్నాయి. చేబ్రోలు మండలంలోని వీరనాయకునిపాలెం, శేకూరు, సుద్దపల్లి, వడ్లమూడి, చేబ్రోలు, నారాకోడూరు తదితర గ్రామాల్లోని పొలాలకు భారీ వరద నీరు చేరింది. వీరనాయకునిపాలెం గ్రామంలోని నల్ల డ్రెయిన్ పొంగి ప్రవహిస్తోంది. మంగళగిరి, గుంటూరు ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా వస్తుండటంతో పొలాలు ముంపుబారిన పడ్డాయి. పొలాలకు వెళ్లటానికి కూడా వీలులేని పరిస్థితి ఏర్పడింది. నడుం లోతులో డొంకరోడ్ల మీద నీరు ప్రవహిస్తోంది. మూడు రోజులుగా పొలాలు నీట మునిగిపోవటంతో పైరు దెబ్బతిని పూర్తిగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

■ సుద్దపల్లి, వేజండ్ల గ్రామాల పరిధిలోని సాగునీటి, మురుగునీటి కాలువలకు పలు చోట్ల గండ్లు పడినట్లు రైతులు చెబుతున్నారు. పొలాలకు వెళ్లటానికి అవకాశం లేని విధంగా నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. మరికొన్ని రోజుల పాటు నీరు బయటకు పోయే మార్గం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

■ శలపాడు గ్రామ పరిధిలోని వరద నీరు పొలాలు ముంపు బారిన పడ్డాయి. వరి, బంతి, పందిరి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పందిళ్లు నేల వాలటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తుంగభద్ర డ్రెయిన్ పొంగి ప్రవహిస్తోంది.

■ నారాకోడూరు గ్రామ పరిధిలో వర్షంనీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవటంతో జీబీసీ రహదారి పక్కన పొలాలు సముద్రాన్ని తలపిస్తున్నాయి. కూరగాయ పంటలైన చిక్కుడు, బీర, దొండ పందిళ్లు నీట నానుతున్నాయి.

■ మంచాల, చేబ్రోలు గ్రామాల్లో వరద ఉధృతి కొంత తగ్గుముఖం పట్టింది. మెరక పొలాల్లోని వరి మొక్కలు బయట పడుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని పొలాలకు చెందిన నీరు బయటకు పంపటానికి రైతులు శ్రమిస్తున్నారు.

సాగునీటి కాలువలు, డ్రెయిన్‌లు సక్రమంగా లేకపోవటంతో వర్షపు నీరు ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోవటంతో పొలాలు ముంపు బారిన పడ్డాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలు రైతులను కుంగదీశాయి.

నీట మునిగిన డీవీసీ కాలనీ

పొన్నూరు: పట్టణ శివారులో ప్రవహిస్తున్న తుంగభద్ర నీటి ఉధృతి పెరగడంతో సమీపాన ఉన్న డీవీసీ కాలనీ నీట మునిగింది. సోమవారం కాలువ నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో డ్రెయిన్ ద్వారా వీధులతో పాటు, ఇళ్లలోకి నీరు చేరింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కాలనీ ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని స్థానికులు వాపోతున్నారు. దశాబ్ద కాలంగా తుంగభద్ర కాలువ, కాలనీకి అనుసంధానంగా ఉన్న ప్రధాన డ్రెయిన్ నిర్వహణ సక్రమంగా లేకపోవడమే సమస్యకు కారణమని ప్రజలు చెబుతున్నారు. వరదలు కురిసిన సమయంలో మొక్కుబడి చర్యలు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి స్థానికులకు ఆహారం అందజేశారు. వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కాలనీని సందర్శించి, సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

-సుమారు 25 ఏళ్ల క్రితం డీవీసీ కాలనీ ఏర్పాటైంది. కాలనీకి సమీపాన ఉన్న తుంగభద్ర కాలువ, కాలనీకి అనుసంధానంగా అప్పట్లో డ్రెయిన్ ఏర్పాటు చేశారు. గత 15 ఏళ్ల క్రితం వరద కారణంగా కాలనీ మునగడంతో తక్కువ పరిణామంలో ఉన్న తూమును పెద్ద సైజులో ఏర్పాటు చేశారు. వరదల సమయంలో తుంగభద్ర కాలువ నీరు కాలనీలోకి రాకుండా ఆ తూముకు అడ్డుకట్ట వేసే దిశగా తగిన చర్యలు చేపట్టక పోవడంతో సమస్య ఏర్పడింది. దీంతో వర్షాలు కురిసిన సమయంలో తుంగభద్ర కాలువ పొంగుతుందన్న ఆందోళనలో కాలనీవాసులు నిద్ర, ఆహారాలు మాని రాత్రంతా జాగారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కురుస్తున్న వర్షాలకు ఏ క్షణాన తుంగభద్ర కాలువ పొంగిపొర్లుతుందోననే భయంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం

పెదకాకాని: తుఫాన్ మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు బాధిత కుటుంబాలకు సోమవారం భరోసా కల్పించారు. అకాల వర్షం వలన వరద ఉధృతికి పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో మరణించిన చిన్నారి పసుపులేటి శారీష్(8), ఉపాధ్యాయుడు నడుంపల్లి రాఘవేంద్రరావు(40), కొప్పారావూరు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు(60) కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న ఎక్స్‌గ్రేషియా 5 లక్షల రూపాయలు నష్టపరిహారం చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణకాంత్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే రైతులకు కష్టాలు

పొన్నూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



నీట మునిగిన వరిని పరిశీలిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం, వైఫల్యంతోనే రైతులు భారీ నష్టానికి గురయ్యారని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపించారు.పొన్నూరు పట్టణం సమీపంలో భారీ వర్షాలతో నీట మునిగిన వరి చేలను సోమవారం ఆయన పరిశీలించారు. పంట మునిగిన కారణాలను రైతుల్ని అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పంట కాల్వలలో చెత్త, వ్యర్థాలను తొలగించని కారణంగానే నీటి ప్రవాహానికి అడ్డుపడి పొలాల్లోకి నీరు చేరిందని రైతులు వాపోయారు. మురళీకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా రైతుల సంక్షేమం దిశగా చర్యలు చేపట్టలేదని విమర్శించారు. వర్షాకాలం సమీపిస్తోందని, వెంటనే డ్రెయిన్లు బాగుచేయాలని రైతులు కోరినా పాలకులు, అధికారులు పట్టించుకోపోవడం అసమర్థ పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేయడమే లక్ష్యంగా ప్రస్తుత పాలకులు ముందుకు సాగుతున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జాలాది యానాదిరావు, పార్టీ నాయకులు అంబటి వెంకటేశ్వరరావు, షేక్ నాజర్, వడ్రాణం ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

మహనీయుడు డాక్టర్ వైఎస్సార్

అంబటి మురళీకృష్ణ



పెదకాకానిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మురళీకృష్ణ తదితరులు

పెదకాకాని: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని మండలంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి ఆయా గ్రామాల్లో నిర్వహించారు. పెదకాకాని, వెనిగండ్ల గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అంబటి మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పెదకాకానిసెంటర్‌లోని డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వెనిగండ్ల పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వైఎస్సార్ రచ్చబండ కార్యాక్రమంలో పాల్గొని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచులు గోళ్ల స్వరూపరాణి, పిట్టు శివకృష్ణారెడ్డి(అగతవరప్పాడు), వేల్పుల శ్రావణి, జెడ్పీటీసీ సభ్యురాలు జి.జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు షేక్ షహనాజ్, మున్నంగి నాగరాణి, మాజీ సర్పంచులు కొండమడుగుల శ్రీనివాసరెడ్డి, ఆత్మకూరి శేషిరెడ్డి(అబ్బులు), మాకిరెడ్డి అనిత, ఆళ్ల ఉషారాణి, కె.లక్ష్మీప్రసన్న, ఆలా శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, ఎం.చంద్రశేఖర్, కె.వెంకటేశ్వరరావు, షేక్ ఆరిఫ్, వీర్ల వీరాంజనేయులు, తోట శ్రీనివాసరావు, ఎస్.దయానంద్, ఎస్.మురళీ మోహన్‌రెడ్డి, కె.రాంప్రసాద్, పల్లె నరేష్, పి.కమల్, బి.భాను, ప్రసాద్, సుబ్బారావు, పి.అనిల్‌కుమార్, షేక్ నజీర్, బి.జోసఫ్ పాల్గొన్నారు.



వెనిగండ్లలో అన్నదానం చేస్తున్న అంబటి మురళీకృష్ణ

జన హృదయ నేత వైఎస్సార్



పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళుర్పిస్తున్న పార్టీ నాయకులు



కాకుమానులో మహానేత చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం



పెద్దివారిపాలెంలో దివంగత నేత విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ రామినేని



వెనిగండ్లలో దివంగత నేత విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న అంబటి మురళీకృష్ణ



చింతలపూడిలో నివాళులర్పిస్తున్న నాయకులు



పట్టణంలోని 12వ వార్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- వాడవాడలా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి
- రాజన్న విగ్రహాలు, చిత్రపటాల వద్ద ఘన నివాళి

పొన్నూరు: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతితో పాటు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ప్రజల మదిలో దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చెరగని ముద్ర వేశారని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ కొనియాడారు. పొన్నూరులో సోమవారం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అంబటి మురళీకృష్ణ పార్టీ నాయకులు డాక్టర్ నల్లమోతు రూత్ రాణి, ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ నాజర్, అంబటి వెంకటేశ్వరరావుతో కలసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తొలుత మండలంలోని మామిళ్లపల్లి, పచ్చల తాడిపర్రు గ్రామాలతో పాటు, పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్, కూరగాయల మార్కెట్ సెంటర్, 23, 12 వార్డులు, చింతలపూడిలోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్సార్ లోకాన్ని విడిచి వెళ్లినా, ఆయన అభిమానుల మదిని వీడలేదని, ఆయన ప్రజా సంక్షేమం కోసం అందించిన సేవలను ప్రజలు మరువలేదని కొనియాడారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగించి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల, సర్పంచులు జాలాది యానాదిరావు, చుండూరు వీరయ్య, పార్టీ నాయకులు వడ్రాణం ప్రసాదు, బొనిగల వేణుప్రసాద్, దేవరకొండ గోపి, మూర్తిరాజు, యందేటి వెంకట సుబ్బయ్య, గేరా సంజీవ్, షేక్ షర్మిల, సుషోబిత, వట్టిప్రోలు రంగారావు పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళి

కాకుమాను: ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించి వారిని అన్ని విధాలుగా ఆదుకునే మహానేతకు ఎప్పుడు మరణం ఉండదని జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని గ్రామాలలో సోమవారం రాత్రి వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. మండల కేంద్రం కాకుమానులో జెడ్పీటీసీ మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు గుల్జార్ బేగం మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భౌతికంగా మనముందు లేకున్నా అనేక కోట్ల మంది ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఎప్పుడు బతికే ఉంటారని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిత్యం శ్రమించిన ఏకైక ప్రజా నాయకుడు రాజశేఖరరెడ్డి అని కొనియాడారు. అందుకు నిదర్శనమే మహానేత మరణం తట్టుకోలేక అనేక వేల మంది ప్రజలు మరణించారని ఆమె గుర్తు చేశారు. కార్యక్రమంలో కాకుమాను ఎంపీటీసీ కానుగుల పరమేశ్వరరావు, గుండేబత్తిన కోటేశ్వరరావు, సొంగా సుబ్బయ్య, మూకిరి సుబ్బారావు, మెరిగల భూషణం పాల్గొన్నారు.

పెద్దివారిపాలెంలో...

మండలంలోని పెద్దివారిపాలెం వైఎస్సార్ సీపీ నాయకుడు వల్లూరి యోహాను ఆధ్వర్యంలో మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు దివంగత నేత విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.